అడ్వాన్స్ లేకుండా అద్దెకు బస్సులు

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 4 : ప్రజలకు ఆర్టీసీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించడం కోసం ఎలాంటి అడ్వాన్స్ లేకుండా అద్దెకు బస్సులు ఇవ్వడం జరుగుతుందని ఆర్టీసీ షాద్‌నగర్ డీఎం ఉష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహ శుభకార్యాలు, విహార యాత్రలు, తీర్థయాత్రలకు అడ్వాన్స్ లేకుండా బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959226287, 9182645281, 7382828790లను సంప్రదించాలని కోరారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 4 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులు అయినవారు ఈ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లను పొందవచ్చన్నారు. ఓపెన్ డిగ్రీలో బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలకుగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 18 వరకు మొదటి సంవత్సరం అడ్మిషన్లను, ఓపెన్ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్‌ను, 7382929657ను సంప్రదించాలని సూచించారు.

కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్

మొయినాబాద్, ఆగస్టు 4 : మూడు సంవత్సరాలపాటు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన కళాశాలలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మొయినాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఓ నర్సింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చి మూడు సంవత్సరాలపాటు విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండా వారి జీవితాలతో ఆడుకుందని మండిపడ్డారు. వారిని మొయినాబాద్‌లో ఉన్న ఓ దవాఖానతో ఒప్పందం చేసుకొని విద్యార్థులను అక్కడ ప్రాక్టీస్‌లో పెట్టడం దారుణమని పేర్కొన్నారు. దవాఖాన యాజమాన్యం విద్యార్థినులతో మూడు సంవత్సరాలు వెట్టిచాకిరి చేయించుకున్నా కనీస గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. తరగతులు నిర్వహించకున్నా తమకు సర్టిఫికెట్లు ఇవ్వాలని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగితే రూ.3క్షలు డిమాండ్ చేయడం దారుణమని మండిపడ్డారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడిన నర్సింగ్ కళాశాల, విద్యార్థినులతో వెట్టిచాకిరి చేయించుకున్న దవాఖాన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

మొయినాబాద్, ఆగస్టు 4 : ఓ కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కిందికి దూసుకెళ్లిన ఘటన శనివారం రాత్రి మండల పరిధిలోనీ అండాపూర్ గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారంజజ గచ్చిబౌలిలోని స్కోడా షోరూంలో పనిచేసే ముగ్గురు వ్యక్తులు షోరూంలోని కారును తీసుకొని మొయినాబాద్ మండల పరిధిలోని అండాపూర్ వైపు వెళ్తున్నారు. కాశీంబౌలి మూలమలుపు వద్ద అతివేగంతో వెళ్లిన కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కిందికి దూసుకెళ్లింది. కారు ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగి రోడ్డు పక్కన పడింది. కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు

తెలుగు యూనివర్సిటీ పేరు మార్చొద్దు

ఆర్కేపురం, ఆగస్టు 4 : తెలుగు యూనివర్సిటీ పేరును మార్చవద్దని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రవి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు పేరును తెలుగు యూనివర్సిటీకి మార్చడం తగదన్నారు. దీంతో ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. యూనివర్సిటీ పేరును మార్చుతామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, నిర్ణయాన్ని వెంటనే వెనుకకు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

ఘనంగా ఊర పోచమ్మ బోనాలు

ఆదిబట్ల, ఆగస్టు 4 : మున్సిపాలిటీ పరిధిలోని ఆదిబట్ల గ్రామంలో ఆదివారం ఊర పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జంగయ్య, కళమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



నాగిరెడ్డిగూడలో కార్మికులకు వైద్య పరీక్షలు

మొయినాబాద్, ఆగస్టు 4 : భవన నిర్మాణ కార్మికులు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకొని లేబర్ కార్డు పొందాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అధికారులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 16 రకాల పరీక్షలు కార్మికులకు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. లేబర్ కార్డు ఉన్న కార్మికులకు ప్రమాద బీమా చేయించుకోవడానికి అవకాశముందని పేర్కొన్నారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సీఐటీయూ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, నాగిరెడ్డిగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి అశోక్, ఉపాధ్యక్షుడు సాయిబాబా, సంఘం సభ్యులు మల్లయ్య, రమేశ్, అశోక్, రవీందర్, సాయిలు, నర్సింహులు, దయాకర్, రవి, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా మహా హోమం

చేవెళ్ల రూరల్, ఆగస్టు 4 : శంకర్‌పల్లి మండల పరిధిలోని పర్వేద అనుబంధ గ్రామం కొత్తగూడెం పాతాళ త్రికోణ మహా సుందరి మహాకాళీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆషాఢ అమావాస్య సందర్భంగా శ్రీవరలక్ష్మి శ్రీవస్థం మహాహోమం, శ్రీరాజరాజేశ్వరి పీఠం శ్రీచక్ర ఆధీనం (కన్యాకుమారి) రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మాధవరెడ్డి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హోమంలో పాల్గొన్నవారికి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, అష్ట ఐశ్వర్యం, వివాహయోగం, సంతానం, అన్ని రకాల ఇబ్బందులను తొలగిస్తుందన్నారు. చందిప్ప గ్రామానికి చెందిన సుధాకర్, ప్రభావతి, కొత్తగూడెం గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి ప్రతినిధి యాదిరెడ్డి

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 4 : తెలంగాణ ప్రజా నాట్యమండలి అబ్దుల్లాపూర్‌మెట్ మండల నిర్మాణ మహాసభ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-2లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి రంగారెడ్డి జిల్లా నిర్మాణ బాధ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యదర్శి వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. కళాకారుల హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తున్న సంఘం ప్రజానాట్యమండలని పేర్కొన్నారు. కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి సాంస్కృతిక రంగంలో తగిన ప్రాధాన్యమివ్వాలని కోరారు. కళాకారులకు ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలని, పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రజా నాట్యమండలి మండల నూతన కమిటీ

ప్రజా నాట్యమండలి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షులుగా రానింగు సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా ముచ్చపోతు రాము, సహాయ కార్యదర్శిగా దాసరి భాస్కర్, కోశాధికారిగా పగడాల మహేందర్, నారాయణ, రాంచందర్, పోచయ్య, నరసింహ, మధు, ఎం.భాస్కర్, లింగం, అంజి, మల్లేశ్, వెంకన్న, విజయ్ తదితర కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలి



నాలుగు మండలాల ముఖ్య కూడలైన ఆమనగల్లులో ఏసీపీ (అసిస్టెంట్ కమిషనర్ అఫ్ పోలీస్) కార్యాలయం ఏర్పాటు చేయాలని స్థానిక పార్లమెంట్ సభ్యుడు మల్లు రవిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కో అర్డినేటర్ వస్పుల జంగయ్య మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. - ఆమనగల్లు, ఆగస్టు 4

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన కొమ్ము జంగమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రాజూనాయక్ అంత్యక్రియల నిమిత్తం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10,000 అందజేశారు. - యాచారం, ఆగస్టు 4

ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీ

ఇద్దరు మృతి.. ఒకరి పరిస్థితి విషమం

రంగాపూర్ రోడ్డు మూలమలుపు వద్ద ఘటన

నందిగామ, ఆగస్టు 4 : ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీకొని తల్లీకొడుకు మృతి చెందిన సంఘటన నందిగామ మండలం రంగపూర్ దర్గా రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన హాజీరాబేగం(35) తన ఇద్దరు కుమారులు అబ్దుల్ రహమాన్(12), అబ్దుల్ రహీంతో కలిసి జేపీ దర్గాకు స్కూటీపై వెళ్తుండగా రంగాపూర్ రోడ్డు మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలిస్తుండగా హాజీరా బేగం, అబ్దుల్ రహమాన్ మృతిచెందారు. రహీంకు శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. రహీం పరిస్థితి విషమంగా ఉన్నది. రంగాపూర్ రోడ్డు మూలమలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఢీకొన్న బస్సు, స్కూటీ

పర్యావరణ పరిరక్షణతో మానవాళికి ఎంతో మేలు

సత్యసాయి సేవా సమితి తెలంగాణ మహిళా యూత్ కో ఆర్డినేటర్ నాగజ్యోతి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

చేవెళ్లటౌన్, ఆగస్టు 4 : పర్యావరణ పరిరక్షణతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని సత్యసాయి సేవా సమితి తెలంగాణ మహిళా యూత్ కో ఆర్డినేటర్ నాగజ్యోతి తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చెట్లను పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో చేవెళ్ల సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామాగౌడ్, యూత్ కో ఆర్డినేటర్ విజయకుమార్, సేవాదళ్ కో ఆర్డినేటర్ భాస్కర్, మహిళా యూత్ కో ఆర్డినేటర్ నిర్మల, సత్యసాయి సేవా సమితి మహిళా సభ్యులు శశిరేఖ, ప్రభావతి, స్వరూప, సభ్యులు మధుసూదన్, పెంటారెడ్డి, మాణిక్యారెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తాం

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి అమెరికా వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణకు చెందిన ఎన్ఆర్ఐలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంను మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ కిరణ్‌రెడ్డి గూడూరు మర్యాదపూర్వకంగా కలిశారు. కడ్తాల్ సమీపంలో ఉన్న కందుకూరు మండలం ముచ్చర్ల పరిసర ప్రాంతాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ శంకుస్థాపన చేయడంతోపాటు, ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు సొంత ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తామని ఆయన పేర్కొన్నారు. - కడ్తాల్, ఆగస్టు 4

ఆత్మీయ సమ్మేళనం

షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వపు ఉపాధ్యాయులను సన్మానించారు. - షాబాద్, ఆగస్టు 4

1997-98 సంవత్సరంలో దేవునిఎర్రవల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 27 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం చేవెళ్ల మండలం ఊరెళ్ల గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. - చేవెళ్ల రూరల్, ఆగస్టు 4

నివాళి.. ఆర్థిక సాయం



మండల పరిధిలోని పులిగోనిపల్లి తండాకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బాణావత్ రమేశ్‌నాయక్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు . విషయం తెలుసుకున్న రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రమేశ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.35వేల ఆర్థికసాయం అందజేశారు. - ఆమనగల్లు, ఆగస్టు 4

ఏబీసీడీ వర్గీకరణపై హర్షం

సుప్రీంకోర్టు వెలువరించిన ఏబీసీడీ వర్గీకరణ తీర్పుతో సమన్యాయం జరుగుతుందని దళిత సంఘం నాయకులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ మున్సిపాలిటీ పరిధి తట్టిఖానా ఆర్కేనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. - పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 4

ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మల్లగల్ల సతీష్‌కుమార్ మాదిగ అన్నారు. ఆదివారం షాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం ప్రధానినరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. - షాబాద్, ఆగస్టు 4

ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల మండల పరిధిలోని హస్తేపూర్ గ్రామంలో మా శారద దవాఖాన, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోలిస్టిక్ హెల్త్ కేర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులకు అన్ని రకాల వాధ్యులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. - చేవెళ్ల రూరల్, ఆగస్టు 4